# విపశ్యన మాసపత్రిక

VOLUME:10 NO - 11 1 FEBRUARY, 2017

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖేత్త, వనస్థలిపురం, హైదరాబాదు - 70


## "ధర్మవాణి"

అసేవన చ బాలానామ్, పండితానంచ సేవనా,

పూజ చ పూజనెయ్యానామ్, ఏతం మంగళముత్తమమ్.

మంగళసుత్త -1. ఖుద్దకపతో

అవివేకులు, మూర్ఖులైన వారి సాహచర్యం నుండి దూరంగా ఉండటం, వివేక వంతులైన వారి సాహచర్యం చేయటం, యోగ్యులైన వారిని, గౌరవింపతగిన వారిని గౌరవించటం, ఇదే ఉత్తమమైన మంగళకార్యము.

## బుద్ధుని మార్గంలో కుల మతాల వివక్షకు తావులేదు

**(మార్చి 2013 ఇంగ్లీషు మాసపత్రిక 'విపశ్యన న్యూస్ లెటర్'లో ప్రచురితమైన శ్రీ కళ్యాణమిత్ర సత్యన్నారాయణ గోయంకాగారి వ్యాసానికి తెలుగు అనువాదము.)**

### గత సంచిక తరువాయి భాగం

1. వెదురు బొంగులతో చాటలు, బుట్టలు మొదలగు వస్తువులను చేయుట (మేదర వాళ్ళు) 2. మట్టితో పాత్రలు, కుండలు లాంటివి చేయుట (కుమ్మరి వారు) 3. జంతువుల చర్మాలతో చెప్పులు మొదలగునవి చేయుట (మాదిగ వారు) 4. క్షౌరం చేయుట(మంగలి వారు) మొదలగు పనులను న్యూనతమైనవిగా భావించేవారు.

క్రింది పనులను అత్యంత తక్కువగా భావించేవారు.

1. మనుషుల మల మూత్రాలను ఎత్తి వేయుట (పాకీ వారు).
2. చెత్త చదారాలను శుభ్ర పరుచుట మొదలైనవి.

క్రింది వృత్తులను ఉత్తమమైనవిగా భావించేవారు.

1. వ్యవసాయము 2. వ్యాపారము 3. పశుపాలన

క్రింద ఉదహరించిన అయిదు కులాలను, వారు చేసే పనులను అత్యంత న్యూనతమైనవిగా భావించే వారని పాలి గ్రంధాలలో ఉదహరించారు.

1. చండాల కుల - శ్మశాన వాటికలో శవాలను కాల్చేవారు.
2. నేసాద కుల - జంతువులను, పక్షులను వేటాడేవారు.
3. వెనకుల - మరుగు దొడ్లను శుభ్రపరిచేవారు.
4. రథకారకుల - చనిపోయిన జంతువుల చర్మాలతో వస్తువులను తయారు చేసేవారు.
5. పుక్కుస కుల - చెత్త చదారాలను శుభ్రపరిచేవారు.

అదే విధంగా క్రింది పనులను చేసేవారిని కూడా తక్కువగా భావించేవారు.

1. నాలకార - బుట్టలు, తట్టలు అల్లేవారు.
2. కుంభకార - మట్టితో కుండలు చేసేవారు.
3. పెసకార - బట్టలు నేసేవారు.
4. చమ్మకార - తోలుతో వస్తువులను చేసేవారు.
5. నాపితా - క్షుర కర్మలు చేసే మంగలివారు.

తక్కువ కులాల వారి నీడ వారిపై పడినప్పటికి వారు మైలబడి పోయినట్లుగా ఎక్కువ కులాల వారు భావించేవారు. పొరపాటున వారి నీడ తగిలితే కోపోద్రిక్తులై వారిని కొట్టేవారు. అందువలన తక్కువ కులాలుగా భావింపబడేవారు చాలా జాగ్రత్తగా, భయపడుతూ, భయపడుతూ తిరుగుతుండే వారు. ఏదైనా పనిమీద పట్టణాలలోకి వచ్చినా, వారి నీడ కూడా ఎవరికి తగల కుండా చూసుకునేవారు.

ఇటువంటి జుగుప్సాకరమైన, భయంకర పరిస్థితుల మధ్య బుద్ధుడు విప్లవాత్మక చర్యలు చేపట్టాడు. అత్యంత తక్కువగా భావింపబడే కులాలకు చెందిన వారిని అతని సంఘంలో చేర్చుకున్నాడు. సంఘంలో చేరిన వారిని సహజంగానే అందరూ గౌరవించేవారు. రాజులు, రాజ్యాధికారులు, వర్తకులు, బ్రాహ్మణులు అందరూ వారిని గౌరవించేవారు. ఈ విధంగా తక్కువ కులాల వారిని ఉద్ధరించే దిశగా చర్యలు చేపట్టాడు.

స్వయంగా బుద్ధుడు ఈ వర్ణ వ్యవస్థను నమ్మేవాడు కాదు. భిక్షు సంఘంలో చేరిన వారెవరిని వారి కులాల ఆధారంగా విభజించటం జరిగేది కాదు. భిక్షు సంఘంలో చేరిన వారందరూ ఎక్కువ కులాలు తక్కువ కులాలనే తేడా లేకుండా అందరి ఇళ్ళకు భిక్షకు వెళ్ళేవారు. ఆ రోజులలో తక్కువ కులాలకు చెందిన వారిని చండాల, వసల అని సంభోదించటం అలవాటుగా ఉండేది. ఎవరైనా క్రొత్తగా చేరిన భిక్షువు ఇతరులను అలా సంభోదిస్తే అది భగవానుడు నిర్దేశించిన భిక్షు నియాలను (వినయ) అతిక్రమించినట్లుగా భావించి వారు తప్పుచేసినట్లుగా నిర్ణయించబడేది.

### ఆ రోజులలోని ఒక సంఘటన

ప్రక్రితి అనే ఒక పదహారేండ్ల వయసు గల అంటరాని



This document was created using SOLID CONVERTER PDF To remove this message, purchase the product at www.SolidDocuments.com

కులానికి చెందిన బాలిక అంటరాని వారి కోసమని నిర్దేశించిన ప్రత్యేకమైన భావిలో తన కుటుంబ అవసరాల కోసం నీళ్ళు తోడుకుంటున్నది. బీదరికంతో పీడింపబడుతున్న ఆ బాలిక చింపిరి జుట్టుతో, మురికిగా చినిగిపోయిన బట్టలు వేసుకొని ఉన్నది. బుద్ధుని శిష్యుడైన ఆనంద అటువైపు వస్తున్నాడు. ఆనంద క్షత్రియ కులంలో జన్మించాడు. ధనవంతుడు. ఆకర్షణీయమైన రూపాన్ని కలిగి ఉన్నాడు. బుద్ధునికి స్వయాన అన్నదమ్ముల వరసకు చెందిన వాడు. అది మండు వేసవి కాలము. అతని గొంతు దాహముతో ఎండిపోతోంది. నీళ్ళు నింపుకుంటున్న ఆ బాలికను చూసి త్రాగటానికి కొంచెం నీళ్ళు పోయమని అడిగాడు. ఆ బాలిక అతనిని చూసి సంభ్రమాశ్చర్యాలకులోనై భయపడి పోయింది. "భిక్షువు అయినప్పటికి, ఇతనేదో ఉన్నత కులానికి చెందిన వ్యక్తి అయి ఉంటాడు. బహుఃశ నేను అంటరాని దానినని, ఈ భావి అంటరాని వారి కోసమని అతనికి తెలిసి ఉండక పోవచ్చు" అని అనుకొన్నది. ఆనందతో, "నేను తక్కువ కులానికి చెందిన దానిని. అంటరాని వారి కోసమని నిర్దేశించబడిన ఈ నీళ్ళు ఎక్కువ కులం వారికి ఇవ్వలేను" అని అన్నది.

"చెల్లీ! నిన్ను మంచి నీళ్ళు అడిగాను, నీ కులాన్ని అడగలేదు". అని ఆనంద ఆమెతో అంటాడు.

భిక్కు ఆనంద మరీమరీ అడగటంతో, ఆ బాలిక భయపడుతూనే ఆనందకు నీళ్ళు ఇస్తుంది. దాహం తీర్చుకున్న భిక్కు ఆనంద తిరిగి వెళ్ళిపోతాడు.

ఈ అంటరాని బాలిక మదిలో ఒక ఆలోచన పుడుతుంది. ఎక్కువ కులానికి చెందిన ఈ యువకుడు నా చేతినీళ్ళు తాగాడు అంటే నన్ను తన భార్యగా స్వీకరించటానికి తప్పక ఒప్పుకోవచ్చు. మొహమాట పడుతూనే ఆనందను అనుసరించి తన మదిలో మాట చెపుతుంది. వెంటనే భిక్కు ఆనంద ఈ అలోచనను తిరస్కరిస్తాడు. ఆమె చాలా నిరుత్సాహ పడుతుంది. తదుపరి ఆనంద ఆమెకు వివరిస్తాడు. "నీ కులాన్ని బట్టి, నీ ఉద్దేశ్యాన్ని తిరస్కరించటం లేదు. నేను ఆజన్మాంతం బ్రహ్మచారిగా ఉండే వ్రతాన్ని స్వీకరించాను. అందువలన నీ ఆలోచనను నేను స్వీకరించలేను. కరుణామయుడైన మన బుద్ధుడు మానవులందరికి శరణును ప్రసాదించాడు. నీవు కూడా వెళ్ళి బుద్ధుడిని శరణువేడుకో. భగవానుడు అందరికి శరణు ఇస్తాడు. సమాజంలో అత్యంత తక్కువగా భావింపబడే కులాలకు చెందిన వారికి కూడా శరణు కల్పిస్తాడు. అక్కడ కులమతాల భేద భావనలకు తావులేదు. బుద్ధుని శరణుజొచ్చిన అనేక మంది తక్కువ కులాలకు చెందినవారు విపశ్యన సాధన ద్వారా ఆర్యులైనారు. ఒకప్పుడు సమాజంలో తక్కువగా చూడబడినవారు ఇప్పుడు అందరిచే గౌరవింపబడుతున్నారు. వెళ్ళు! ఏ మాత్రం సందేహించకుండా బుద్ధుని శరణువేడుకో. అక్కడ ఎంతోమంది సాధ్వీమణులున్నారు. మాతా మహాప్రజాపతి నిన్ను చక్కగా చూసుకుంటుంది".

ఇది విన్న ఆ అంటరాని బాలిక ప్రక్రితి చాలా సంతోషపడింది. బుద్ధుని వద్దకు వెళ్ళి శరణువేడుకుంది. ఆమెకు విపశ్యన ధ్యానాన్ని నేర్పాడు. కాలక్రమేణ ఆమె ఒక మంచి సాధకురాలిగా ఎదిగింది.

ఒకసారి మగధ రాజధానియైన రాజగిరి రాజవీధులలో బుద్ధుడు తన భిక్కు సంఘంతో సహా భిక్షాటన చేస్తున్నాడు. వీధులను శుభ్రపరిచే సునీతుడు ఆ సమయంలో తన చీపురుతో రాజవీధిని చిమ్ముతున్నాడు. తక్కువ కులంలో జన్మించినందున, అంటరాని వాడుగా పరిగణింపబడుతున్నందున తన నీడ బుద్ధునిపై పడకూడదనే ఆలోచన అతనికి కలిగింది. భయపడుతూ ముకుళిత హస్తాలతో ప్రక్కకు జరిగి నుంచున్నాడు. భగవానుడు అతని ఆలోచనలను తెలుసుకున్నాడు. సమాజం యొక్క క్షమింపరాని, దుర్మార్గపు, వంకర మార్గాలకు బలియైన సునీతుని చూచిన భగవానుని హృదయం ద్రవించి కరుణ ఉప్పొంగింది. అతనిని రమ్మన్నాడు. తన భిక్కు సంఘంతో సహా రాజగిరిలోని వేణువనంలో ఉన్న తన విహారానికి తోడ్కొని వచ్చాడు. బుద్ధుడు అతనికి విపశ్యన అభ్యాసం ఎలా చేయాలో నేర్పాడు. భిక్కు సంఘంలో చేర్చుకొన బడినాడు. అరహంతుడైనాడు. అనగా పూర్తిగా విముక్తి పొందిన వ్యక్తి, జీవన్ముక్తుడైనాడు. అతను ఒక రోడ్లు ఊడ్చేవాడినుండి అసలైన బ్రాహ్మణుడైనాడు.

సొపాక అనే చండాల కులంలో పుట్టిన బాలుడు 4 సం॥ల వయసుకే అనాధ అయిపోయినాడు. కటిక దరిద్రంలో బతుకుతున్న అతని మామయ్య ఈ బాలుని భారంగా భావించాడు. ఇతనిని భరించలేక ఇతనికి 7 సం॥ల వయసు ఉన్నప్పుడే ఒక పీనుగకు గట్టిగా కట్టివేసి పశు పక్ష్యాదులు పీక్కుతింటాయని శ్మశానంలో వదిలి వేస్తాడు. అనంత కరుణామయుడైన బుద్ధుడు ఈ సంఘటనను చూస్తాడు. సొపాకను బంధ విముక్తుడను చేసి విహారానికి తీసుకురమ్మని చెప్పి ఒక భిక్షువును పంపిస్తాడు. అతనిని సంఘంలో చేర్చుకుని అతనికి ధ్యానాన్ని నేర్పుతారు. కాలక్రమేణా అత్యంత నిష్ఠతో అభ్యాసంచేస్తూ సొపాక అరహంతుడవుతాడు.

బాబా సాహెబ్ అంబేద్కర్ కూడా ఇలాంటి సాహసోపేతమైన చర్యలను చేపట్టాడని చరిత్ర చెపుతుంది. అతను భారత రాజ్యాంగాన్ని రచించేటప్పుడు అందులో ఏ విధమైన కుల వివక్షలకు తావులేకుండా ఉండేటట్లు చూసుకున్నాడు. ప్రతి మనిషి ఒక మనిషే. తక్కువ కులాలకు చెందినవారికి విద్యావకాశాలు కల్పించాడు. తక్కువ కులాలకు చెందినవారు కూడా ఉన్నత చదువులు చదువుకుని ప్రభుత్వంలో పెద్ద పెద్ద అధికారులైనారు. అప్పుడు వారిని ఎవరు చులకనగా చూస్తారు? ఈ విధంగా బాబా సాహెబ్ అంబేద్కర్ గారు కుల వివక్షతలను నిర్మూలించటానికి ఎంతో కృషి చేసారు.

దురదృష్టవశాత్తు ఈ కుల వ్యవస్థ ఎక్కువ, తక్కువలు, అంటరానితనం నేటికీ కొన్ని గ్రామాలలో దర్శనమిస్తుంది. ఇది పూర్తిగా నిర్మూలింపబడలేదు.

నేను ఛాందసమైన పూర్వాచారాలను నిష్ఠగా పాటించే కుటుంబంలో పుట్టి పెరిగాను. నేను మయన్మార్‌లో ఉన్నప్పటి సంగతులు



This document was created using SOLID CONVERTER PDF To remove this message, purchase the product at www.SolidDocuments.com

నాకు బాగా గుర్తున్నాయి. అక్కడ రోడ్లు ఊడ్చేవారిని, చెప్పులు కుట్టేవారినే కాకుండా ఇంకా అనేక మందిని తక్కువ కులాల వారిగా భావించేవారు. వారు ముట్టుకున్న నీటిని త్రాగటం కూడా మాకు నిషేదం. ఈ విధమైన వివక్షను నిర్మూలించటంలో బాబా సాహెబ్ గారు చాలా కృషి చేసారు. ఎన్నో మార్పులను తెచ్చారు. అయినప్పటికి సమాజంలోని ఈ రుగ్మత పూర్తిగా నిర్మూలింపబడలేదు. ఇప్పటికి కొన్ని చోట్ల తక్కువ కులాల వారిని అధములుగాను, ఎక్కువ కులాల వారిని గొప్పవారిగాను సమాజం గుర్తిస్తుంది.

బుద్ధుడు తక్కువ కులాల వారిని సంఘంలో చేర్చుకుని విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టినట్లే, బాబా సాహెబ్ అంబేద్కర్ వారికి విద్యావకాశాలు కల్పించి సమాజంలో గౌరవాన్ని కలిగించాడు. ఇప్పటికీ ఈ వివక్ష పూర్తిగా నిర్మూలింపబడకుండా ఉండటం మన దేశానికి పట్టిన దౌర్భాగ్యం.

ఇప్పుడు విపశ్యన ఇంకొక అడుగు ముందుకు వేసింది. అన్ని కుల, మతాలకు చెందిన వారు విపశ్యన శిబిరాలలో చేరుతున్నారు. ఇక్కడ ఎక్కువ తక్కువలు ఉండవు. అందరూ సమానంగా చూడబడతారు. కలిసి సాధన చేస్తారు. కలిసి భోజనం చేస్తారు. కలిసి ఉంటారు. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందంటే, సమాజంలో దళితులుగా భావింపబడ్డ చాలామంది, విపశ్యన అభ్యాసంలో ముందుకుపోయి సహాయక ఆచార్యులుగా నియమింపబడ్డారు. దళితజాతికి చెందిన ఒక వ్యక్తి ధర్మ ఆసనంపై కూర్చొని ఉంటే అతను దళతుడుకాడు. ధర్మానికి ప్రతినిధిగా ఉన్న ఆచార్యుడు. ధ్యానాన్ని నేర్చుకోవటానికి వచ్చేవారంత ధర్మప్రతినిధిగా ఉన్న ఆచార్యునికి వందనం చేస్తారు. వారు బ్రాహ్మణులా, క్షత్రియులా, వైశ్యులా అని చూడరు. సాధకులు ఆచార్యులకు గౌరవ వందనాలు సమర్పించి వారినుండి ధర్మాన్ని నేర్చుకుంటారు. బుద్ధ బోధనలలో కుల వివక్షకు తావులేదు. ఈ శిబిరాలలో విపశ్యన ధ్యానము యొక్క పరిజ్ఞానము, దాని సాధనా పద్ధతి అత్యంత ముఖ్యమైన విషయాలు. ఇవి అందరికీ అందుబాటులో ఉంటాయి. సమాజంలోని ఈ అంతరాలను ఛేదించటంలో విపశ్యన చక్కగా దోహదపడుతుంది. సమాజాన్ని ఇది ఎంతవరకు ప్రభావితం చేయగలదో వేచి చూద్దాము. దేశంనుండి, సమాజంనుండి ఈ దురదృష్టకరమైన వివక్ష పూర్తిగా నశించినప్పుడే అసలైన సంతోషం కలుగుతుంది. అదే అందరికీ శ్రేయస్కరమవుతుంది.

**॥భవతు సర్వ మంగళం॥**

**'కళ్యాణమిత్ర' శ్రీ సత్యన్నారాయణ గోయంకా.**

# కృతజ్ఞతతో!

*(25 మే, 2013 నాటి ఆంగ్లపత్రిక "విపశ్యన న్యూస్ లెటర్" లో ప్రచురితమైన పూజ్య గురూజీ విపశ్యన ఆచార్యులు, పద్మభూషణ, కళ్యామిత్ర శ్రీ సత్యనారాయణ గోయంకాగారి వ్యాసం యొక్క అనువాదము.)*

**అత్యంత గౌరవనీయులైన గురుదేవులు సయాజీ!**

ఈ రోజుకు కూడా మీ ఉనికి నాతోనే ఉన్నట్లనిపిస్తుంది. ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడ మీ ఉనికి తప్పక ఉంటుంది. ధర్మం ఎల్లప్పుడు నిలిచి ఉండాలి. అప్పుడు మీ ఉనికి కూడా ఎల్లప్పుడూ ఉంటుంది. ఇదే నా బలీయమైన కోరిక.

ఎంత సంతోషకరమైనది మీ ఉనికి! అది స్వయంగా ధర్మసాన్నిధ్యంలో ఉన్నట్లే ఉంటుంది. నేను ధర్మ సాన్నిధ్యంలో ఉన్నప్పుడల్లా మీ అనంతమైన కరుణ జ్ఞప్తికి వస్తుంది. నా మనసు ఆనందపరవశంతో, కృతజ్ఞతతో నిండిపోతుంది.

అసంఖ్యాకమైన ఎన్నో జన్మల నుండి తపోజీవనం గడుపుతూ పది పారమితలను పరిపూర్ణంగా పూర్తిచేసుకుని, పూర్తిగా విముక్తి పొందిన శాక్యముని గౌతముడైన భగవానుని పట్ల అనంతమైన కృతజ్ఞతతో మనసు నిండిపోతుంది. పది పారమితలను పరిపూర్ణంగా పూర్తిచేసుకుని తను కనుగొనిన ఈ మార్గంలో స్వయంగా తాను పయనించి పూర్తిగా విముక్తి పొందటమే కాకుండా అనేక మందికి ఈ మార్గాన్ని బోధించి వారు కూడా స్వయంగా ఈ మార్గంలో పయనించి పూర్తిగా విముక్తి పొందుటకు దోహద పడ్డారు. కరుణాభరిత హృదయంతో తన శేష జీవితమంతా ప్రజలకు ఈ మార్గాన్ని బోధిస్తూనే గడిపారు. లెక్కలేనంత మంది దీనినుండి లాభాన్వితులైనారు.

విముక్తి పొందిన అరహంతులందరికి కృతజ్ఞతతో నాహృదయం నిండిపోతుంది. భగవానుని నుండి విద్యను పొంది అరహంతులైన పిదప వారు భగవానుని ఉదాత్తమైన కోరిక అయిన ***"చరథ భిక్ఖవె చారికమ్,బహుజన హితాయ, బహుజన సుఖాయ లోకానుకంపాయ"*** అనగా అనేక మంది హితంకోసం, అనేక మంది సుఖంకోసం, లోకంపట్ల కరుణతో నలుదిశలకు సంచరిస్తూ ఉండాలి, అనే దానికి అనుగుణంగా పల్లె, పల్లెకు పట్టణాలకు, జిల్లాలకు పోయి వారి శేష జీవితాన్ని గడిపేవారు. అక్కడి ప్రజలకు ఈ విసుద్ధి మార్గాన్ని బోధించేవారు.

తరతరాలనుండి ఈ ధర్మగంగను పరిశుద్ధంగా ఉంచిన వారందరికి కృతజ్ఞలతో మనసు నిండిపోతుంది.

ముఖ్యంగా సోన, ఉత్తర అనే ఇద్దరు అరహంతులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. వీరు ఎన్నో కష్టాలను ఎదుర్కొని ధైర్యంగా పరాయి దేశానికి వచ్చారు. భగీరథునివలె ధర్మగంగను సువర్ణభూమి (మయన్మార్)కి తెచ్చారు. అనేక మంది దాహాన్ని తీర్చారు.

మయన్మార్‌లోని ధర్మ గురువులందరికి హృదయపూర్వక కృతజ్ఞతలు, వీరు గురు–శిష్య పరంపరలో తరతరాల నుండి ధర్మాన్ని పరిశుద్ధంగా ఉంచారు. ఒక్క శబ్దం కూడా ఇందులో కలవకుండా చూసారు. ఏ విధమైన సాంప్రదాయాలు, శాఖలు తెగలతో కలవకుండా కాపాడారు. కల్పనలకు, ఊహలకు తావులేకుండా పరిరక్షించారు. ధర్మాన్ని స్వచ్ఛంగా, నిర్మలంగా ఉంచారు. అందువలననే మనకు పరిశుద్ధమైన ధర్మం లభించింది.



This document was created using SOLID CONVERTER PDF To remove this message, purchase the product at www.SolidDocuments.com

ఈ మార్గం మనలను సులభంగా తెలియవచ్చే స్థూలమైన సత్యాన్నుండి పరమ సత్యం వైపు పయనింప చేస్తుంది. అత్యంత సూక్ష్మమైన పరమ సత్యాన్ని చేరుకోవటానికి ఇది రాజమార్గము. చిన్నచిన్న సందులలో గొందులలో ఇరుక్కుపోయి అక్కడ కనపడే సత్యాలతోనే సంతృప్తి చెందేటట్లు చేసేది కాదు. లేక మార్గమధ్యంలోనే ఆగిపోయి కల్పనలలో, ఊహలలో చిక్కుకుపోయేటట్లు చేసేది కాదు. పూజ్యులైన లేడి సయదాగారు గత శతాబ్దంలోని గురుశృంఖలంలోని గురువులలో దేదీప్యమానంగా వెలిగిన నక్షత్రంలాంటివారు. వీరికి హృదయ పూర్వక కృతజ్ఞలతో మనసు నిండిపోతుంది.

సామాన్య జీవితం గడుపుతూ ఎంతో ఆదర్శవంతంగా ఈ కార్యాన్ని నిర్వహించిన సయాతేగి గారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు.

గురుదేవ్! మీకు హృదయ పూర్వక కృతజ్ఞతలతో నా మనసు ఉప్పొంగిపోతుంది. అమూల్యమైన ఈ ధర్మ రత్నాన్ని కరుణాభరిత హృదయంతో నాకు కానుకగా ఇచ్చారు. ఈ ధర్మ రత్నం నాకు దొరకక పోయినట్లైతే నా పరిస్థితి ఏమైపోయేదో! ధనార్జనలో, ఈ పోటీ ప్రపంచంలో పోటీబడి సమాజంలో గుర్తింపుకోసం నా జీవితం వృథా అయిపోయేది. నేను ధర్మంపట్ల ఆకర్షితుడనైనప్పటికీ ఏవో సాంప్రదాయక జంజాటాలలో ఇరుక్కుని ఉండేవాడిని. ఎవరో చెప్పినవి విని, చదివి, వల్లెవేస్తూ జీవితాన్ని వృథాచేసుకునేవాడిని. ఆ పరోక్ష జ్ఞానంతోనే తృప్తిచేందేవాడిని. శుద్ధ ధర్మంయొక్క ప్రత్యక్ష జ్ఞానం ద్వారా జనించే సమ్యక్ దృష్టిని ఎలా వృద్ధిచేసుకోగలిగే వాడిని? ఏవో కల్పనలనే సమ్యక్ దృష్టి బలవంతంగా నమ్మవలసి వచ్చేది. వాటితోనే తృప్తిచెంది ఉండేవాడిని. ఉన్నది ఉన్నట్లుగా స్వానుభవంతో తెలుసుకో కలిగే సమ్యక్ దృష్టి ఎలా నేను పొందగలిగేవాడిని? కర్మకాండలు చేసుకుంటూ, ప్రార్థనలు చేసుకుంటూ ఆధ్యాత్మిక గ్రంధాలు తిరగవేస్తూ, కీర్తనలు పాడుకుంటూ స్వానుభవానికి తావులేని ఏవో అంధ విశ్వాసాలతో, మూఢ నమ్మకాలతో మానవ జీవితాన్ని వృథా చేసుకునేవాడిని. గురుదేవ్! ఈ అమూల్యమైన ధర్మరత్నాన్ని నాకు కానుకగా ఇచ్చి నా జీవితానికి సార్థకతను కలిగించారు.

నిజంగా ఈ ధర్మసాధన అత్యంత విశిష్టమైనది. దీనికిదేసాటి. స్పష్టమైనది, సరళమైనది, వైజ్ఞానికమైనది, కళ్యాణకరమైనది. బంధాలనుండి విముక్తివైపు, భ్రమలు, కల్పనలనుండి వాస్తవికతవైపు మనలను తీసుకుపోతుంది. కనపడే, తెలియవచ్చే స్థూల సత్యంనుండి పరమ సత్యంవైపుకు తీసుకుపోతుంది. అమూల్యమైన ఈ ధర్మం యొక్క స్వచ్ఛత ఇలాగే కొనసాగుగాక. ఈ శుభదినాన నేను ధృఢంగా నిశ్చయించుకునేది, కోరుకునేది ఇదే. పొరపాటున కూడా నావలన ఏ తప్పు జరుగకుండుగాక! ఏవిధమైన మలినాలు ఇందులో చొరబడకుండుగాక! ఈ అమూల్యమైన నిధి ఇలాగే రక్షింపబడుతూ ఉండుగాక! దీని సాధన ద్వారా ప్రజలు నిర్వాణప్రాప్తిని పొందుదురుగాక!

ఈ విధంగా మేము నిన్ను పూజిస్తున్నాము. మాయొక్క కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము. మీకు మా నమస్కారాలు తెలుపుకోవటానికి ఇదే శ్రేష్టమైన పద్ధతి

## అందరికీ ఆనపాన

ఏ కారణాలవల్లనైనా గానీ 10 రోజుల శిబిరంలో చేరి విపశ్యన అభ్యాసాన్ని నేర్చుకునే సాహసం చేయలేని వారి కొరకు, అనంత కరుణతో అందరికీ లాభం చేకూరాలనే సంకల్పంతో పూజ్య గురూజీ కళ్యాణమిత్ర, పద్మభూషణ శ్రీ సత్యనారాయణ గోయంకాగారు "ఆనపాన సతి" సాధనా పద్ధతిని అందరికి అందుబాటులో ఉంచినారు. ఇది విపశ్యన ధ్యానానికి ఓనమాల వంటిది. ప్రారంభదశ. 10 సంIIల వయసు నిండిన వారెవరైనా దీనిని అభ్యాసం చేయవచ్చును. అంతర్జాలములో (www.vridhamma.org) అను సైటును తెరవవలెను. హెూమ్ పేజీలో కుడిభాగమునకల "మినీ ఆనపాన ఫర్-ఆల్ అనుదానిపై క్లిక్ చేయవలయును. తదుపరి వచ్చే విండోలోని ఆడియోస్ అనుదానిపై క్లిక్ చేయవలయును. గోయంకాగారు "ఆనపాన" సతిని ఏ విధంగా అభ్యాసం చేయాలో నేర్పుతారు. దీనిని మీరు ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకుని మీ వద్ద ఉంచుకుని మీ అనుకూలం ప్రకారం సాధన చేసుకొనవచ్చును.


రెండు సంవత్సరాలకు చందా రూ 100/- | విపశ్యన తెలుగు మాసపత్రిక | జీవిత చందా రూ. 500/-
ప్రచురణ తేది: ప్రతినెల 30/31 | పోష్టింగ్ తేది: ప్రతి నెల 1/2 | వెల: రూ 5/-
విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు - 500 070. ఫోన్ : 24240290 (ధ్యానకేంద్రం)
ఆఫీసు పని చేయు వేళలు : ఉదయం 9గంIIల నుండి సాయంత్రం 5 గంIIల వరకు

Postal Reg. HSE 864/2016-2018 RNI Reg. No. APTEL/2006/17745


**PRINTED MATTER**


If Undelivered please return to :

**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org



Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam. Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.



This document was created using SOLID CONVERTER PDF To remove this message, purchase the product at www.SolidDocuments.com